క్లుప్తంగా

ప్రజల పక్షాన పనిచేస్తాను

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జిల్లాలోని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎంపీ చింతా అనురాధ, జిల్లా పార్టీ అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ల సహకారంతో ఎప్పుడూ ప్రజల పక్షానే పనిచేస్తానని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశాక గోపాలపురం నుంచి అమలాపురం వరకూ ఊరేగింపుగా తనను తీసుకొచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఆయన బుధవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు.

గర్భిణులకు ఉచిత భోజన ప్యాకెట్ల అందజేత



గర్భిణులకు భోజన ప్యాకెట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

తాళ్లరేవు: స్థానిక సామాజిక ఆస్పత్రికి పరీక్షల కోసం వచ్చిన సుమారు 50 మంది గర్భిణులకు చిట్టూరి కృష్ణ లయన్స్ ఆర్య జనని ట్రస్ట్ ద్వారా తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఉచిత భోజన ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు చోడే శ్రీనివాస్, కట్టా ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెగా శిబిరంలో 600 మందికి వైద్య పరీక్షలు



మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: యూటీఎఫ్ ఆధ్వర్యంలో అమలాపురం సర్ సీవీ రామన్ పబ్లిక్ స్కూల్‌లో జీఎస్ఎల్ ట్రస్ట్ క్యాన్సర్ హాస్పిటల్ రాజమండ్రి వారిచే మెగా వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రారంభించిన ఈ శిబిరంలో గుండె, ఎముకలు, ఊపిరితిత్తులు, గైనకాలజీ, ఈఎన్టీ, ఆప్తమాలజీ, డెంటల్ విభాగాల్లో సుమారు 600 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబసు, గౌరవ అధ్యక్షుడు ఎంటీవీ సుబ్బారావు, అసోసియేట్ అధ్యక్షురాలు శిరోమణి, జిల్లా ట్రెజరర్ కె.సురేష్‌కుమార్, సీవీ రామన్ చైర్మన్ రమణం వేణుగోపాలరావు, ప్రిన్సిపల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కుడుపూడికి సత్కారం



ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరించిన కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధుల బృందం

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావును కోనసీమ రైల్వే సాధన సమితి(కేఆర్ఎస్ఎస్) ప్రతినిధులు స్థానిక హైస్కూలు సెంటరులో బుధవారం రాత్రి కలిసి సత్కరించారు. కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధిగా తన వంతు కృషి చేస్తున్న కుడుపూడి సూర్యనారాయణరావు ఎమ్మెల్సీ కావడంపై సంస్థ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఇక నుంచి ఎమ్మెల్సీగా కోనసీమ రైలు కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీని సత్కరించినవారిలో కేఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, కేఆర్ఎస్ఎస్ ప్రతినిధులు కల్వకొలను తాతాజీ, సప్పా నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

వాటర్ కూలర్ ప్రారంభం



మండల పరిషత్ కార్యాలయంలో వాటర్ కూలర్ ప్రారంభిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

అమలాపురం రూరల్: వేసవి వడగాల్పుల నుంచి ఉపశమనం కలిగించేందుకు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి బుధవారం ప్రారంభించారు. మండల ప్రజాపరిషత్‌కు వచ్చే ప్రజలు, విధులు నిర్వహించే ఉద్యోగులకు చల్లని నీరు అందించేందుకు వాటర్ కూలర్ ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, ఎండీవో కాశీవిజయప్రసాద్, ఏవో కుమారి, డివిజన్ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు చేగొండి సత్యనారాయణమూర్తి, కార్యదర్శిరెడ్డి శిరీష తదితరులు పాల్గొన్నారు.

రహదారి.. రక్తసిక్తం

- మితిమీరిన వేగం... మద్యం మత్తే కారణం
- వరుస ప్రమాదాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు



వరుస ప్రమాదాలతో బెంబేలెత్తిస్తున్న కత్తిపూడి-పామర్రు జాతీయ రహదారి-216

తాళ్లరేవు: జాతీయ రహదారి-216 రక్తసిక్తమవుతోంది. మితిమీరిన వేగం, మద్యం మత్తు కారణంగా ఇటీవల వరుస రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఒక్క ముమ్మిడివరం నియోజకవర్గంలోనే నెల రోజుల వ్యవధిలో ఏకంగా 15 మంది మృత్యువాత పడడంతో పాటు మరో 30 మంది గాయపడ్డారంటే పరిస్థితిని అర్థం చేసుకోవొచ్చు. రహదారి ప్రమాదాల్లో ప్రధానంగా కుటుంబానికి జీవనాధారమైన వ్యక్తులు చనిపోతుండడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అందుకే ప్రజలు జాతీయ రహదారిపై ప్రయాణించాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు.

కత్తిపూడి-పామర్రు 216 జాతీయ రహదారిలో కాకినాడ, అమలాపురం మధ్య ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరగడంతో అనేక మంది మృత్యువాత పడుతున్నారు. ఈ నెల 14వ తేదీ ఆదివారం తాళ్లరేవు బైపాస్ జంక్షన్‌లో ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందగా, మరో ఏడుగురు తీవ్ర గాయాల పాలవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. జాతీయ రహదారిలోకి ప్రవేశించే వాహనాల వేగాన్ని నియంత్రించాలని, పరిమితికి మించి వాహనాల్లో జనాన్ని తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జాతీయ రహదారిలో ప్రమాదాలు పెరగడానికి గల కారణాలను గుర్తించి భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని నిపుణులు సూచిస్తున్నారు.

మలుపులు.. మద్యం మత్తు.. అతి వేగం..

- జాతీయ రహదారిలోని అనేక ప్రధాన కూడళ్లలో మలుపులు ఎక్కువగా ఉండడం, వాహనదారులు వేగంగా ప్రయాణిస్తుండడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించేలోపే ప్రమాదాలు జరుగుతున్నాయి. పైగా డివైడర్‌లు, హెచ్చరిక బోర్డులు, విద్యుత్ దీపాలు లేకపోవడం వల్ల సైతం ప్రమాదాలు పెరుగుతున్నాయి.
- జాతీయ రహదారికి చేర్చి ఉన్న గ్రామీణ రహదారుల వద్ద స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వాహనదారులు వేగంగా హైవేపైకి వస్తున్నారు. దీనివల్ల జాతీయ రహదారిపై అత్యంత వేగంగా వెళ్లే వాహనాలు ఢీకొని చనిపోతున్నారు.



జాతీయ రహదారిలో జరిగిన ప్రమాద దృశ్యం(ఫైల్)

- యువత యానాం వచ్చి పార్టీలు సెలబ్రేట్ చేసుకుని మద్యం మత్తులో వాహనాలపై ప్రయాణించడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. పైగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు గాయాలై చనిపోతున్నారు. పోలేకుర్రు వై.జంక్షన్, సుంకటరేవు, తాళ్లరేవు బైపాస్ జంక్షన్, పటవల వద్ద ఇటీవల జరిగిన ప్రమాదాల్లో నలుగురు హెల్మెట్ ధరించకపోవడం వల్లే తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు.

రహదారిపైకి రావాలంటే భయమేస్తుంది



హైవేలో అత్యంత వేగంగా వెళుతున్న వాహనాలను దాటుకుని అవతలి వైపుకి వెళ్లాలంటేనే చాలా భయమేస్తుంది. రహదారిలో డివైడర్‌లు ఏర్పాటు చేయడంతో పాటు జంక్షన్‌లలో తక్షణమే సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. హైవేకు అనుబంధంగా ఉన్న రహదారులకు స్పీడ్ బ్రేకర్లు వేయించాలి.

– కొపనాతి నాగరాజు, మత్స్యకార నాయకుడు, చినబొడ్డు వెంకటాయపాలెం

నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి



ఇటీవల తాళ్లరేవు బైపాస్ జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మహిళా కూలీలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి. రొయ్యల పరిశ్రమల యాజమాన్యం కూడా నష్ట పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలి. జాతీయ రహదారిపై భద్రతా చర్యలను పెంచాలి.

– టేకుమూడి ఈశ్వరరావు, ప్రజా సంఘాల నాయకుడు, తాళ్లరేవు మండలం

పంచాయతీ సిబ్బందికి అభినందనలు

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని రెండు సచివాలయాల్లో ఇంటి పన్నులు, ఇతర ఆదాయాలను 100 శాతం వసూలు చేసినందుకు పంచాయతీ సిబ్బందిని డీఎల్‌పీఓ బొజ్జిరాజు అభినందించారు. బోడసకుర్రు సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి పన్నుల వసూళ్ల రికార్డుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బహిరంగ మల విసర్జన నిర్మూలన గ్రామమైన బోడసకుర్రులో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి లబ్ధిదారుల డేటాను వలంటీర్ల ద్వారా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.



వంద శాతం పన్ను వసూళ్ల వివరాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ బొజ్జిరాజు

కార్యక్రమంలో కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రయాణికులను ఆపి.. దాహార్తి తీర్చి..



అమలాపురంలో మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఆపి దాహార్తి తీర్చుతున్న ఎఫ్‌టీఎస్ సేవకులు



ఆటోలో వెళుతున్న ప్రయాణికులకు మజ్జిగ అందిస్తున్న ఎఫ్‌టీఎస్ సేవకురాలు

మండు వేసవిలో ఎఫ్‌టీఎస్ సంచార చలివేంద్రం సేవలు

అమలాపురం టౌన్: చలి వేంద్రం అంటే ఏదో ఒక చోట ఏర్పాటు చేస్తే ఆ దారిని పోయే బాటసారులో, ప్రయాణికులో అక్కడికి వచ్చి దాహార్తిని తీర్చుకుంటుంటారు. అయితే అమలాపురం ఫ్రీ టైమ్ సర్వీస్(ఎఫ్‌టీఎస్) ప్రతినిధుల బృందం మాత్రం పట్టణంలో రోజుకోచోట చలివేంద్రాన్ని సంచార పద్ధతిలో ఏర్పాటు చేసి ప్రయాణికుల్ని ఆపి మరీ వారి దాహార్తిని తీర్చుతున్నారు. ప్రయాణికులు చలివేంద్రం వద్దకు రాకుండా ఎఫ్‌టీఎస్ బృంద సేవకులు రోడ్డపై వారిని ఆపి వారి వద్దకే చల్లటి మజ్జిగను తీసుకెళ్లి అందిస్తున్నారు. అమలాపురం కాలేజీ రోడ్డులో 216 జాతీయ రహదారిపై బుధవారం మిట్ట మధ్యాహ్నం ఎఫ్‌టీఎస్ సేవా బృంద సభ్యులు రోడ్డెక్కి ప్రయాణికులను ఆపి మజ్జిగ అందించి దాహార్తి తీర్చారు. భానుడు నిప్పులు కురిపిస్తున్న వేళ వారు అందిస్తున్న సేవలను అంతా అభినందిస్తున్నారు.

కోరంగిలో అటవీ సిబ్బంది శ్రమదానం



దిండి గ్రామంలో శ్రమదానం చేస్తున్న అటవీ సిబ్బంది

తాళ్లరేవు: లైఫ్ స్టయిల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా కోరంగి పంచాయతీ దిండి గ్రామంలో అటవీ సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో వచ్చే నెల 5వ తేదీ వరకూ ప్లాస్టిక్ నియంత్రణ-పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం దిండి గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.నాగార్జున, వీరభద్రరావు తదితరులు ప్లాస్టిక్ వల్ల మానవాళికి కలిగే నష్టాలను వివరించి ప్లాస్టిక్ నియంత్రణ అందరి బాధ్యతని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌లు కె.మహేష్, కె.ధనుంజయరావు, జి.గోపీ నాగేంద్రకుమార్, ఎస్‌కేఎం సుభాని, ఎస్.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలతో ఉపశమనం

అంబాజీపేట: వేసవి తాపం నుంచి సేద తీరేందుకు చలివేంద్రాలతో ఉపశమనం పొందవచ్చని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎండలు మండిపోతున్నాయని అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద, ముఖ్య కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీ బుడితి సత్యనారాయణమ్మ, విత్తనాల శేఖర్, రాయుడు కృష్ణమహేష్, మామిడిశెట్టి బుల్లియ్య, దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు.



అంబాజీపేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

చిన్నారుల ఆరోగ్య రక్షణకు కృషి చేయాలి

అలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. వైద్యాధికారులు ఆధ్వర్యంలో సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎన్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలు, గర్భిణులకు ఇంజక్షన్లు చేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్-బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను, యాంటీ బయాటిక్ మందులను అందజేశారు. హెల్త్, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

- మంత్రి విశ్వరూప్ తనయుడు పినిపే శ్రీకాంత్
- భీమనపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం

ఉప్పలగుప్తం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని భీమనపల్లి గ్రామంలోని సచివాలయం-1 పరిధిలో స్థానిక నాయకులతో కలిసి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. జగనన్న పరిపాలనలోనే కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరికీ లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 95 శాతం హామీలను అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీదే అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, వైఎస్సార్ హార్టీకల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ మోటూరి సాయి, మండల చైర్మన్ మానే శ్రీను, సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, యర్రంశెట్టి రామచంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, మేడిశెట్టి సూరిబాబు, జంపన బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



భీమనపల్లిలో సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను లబ్ధిదారుడికి అందజేస్తున్న శ్రీకాంత్ తదితరులు

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్

యానాం: యానాం నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో ఉపాధ్యాయులు సంసిద్ధులై విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక దరియాలతిప్ప డాక్టర్ కేఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత సైకిళ్లు, రెయిన్ కోట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వం మంజూరుచేసిన 400 సైకిళ్లను విద్యార్థులకు అందిస్తున్నామని చెప్పారు. పదో తరగతిలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు.

గిరియాంపేట తాగునీటి సమస్యపై ఫిర్యాదు

గిరియాంపేట వీధుల్లో తాగునీరు సరిగా అందడం లేదని స్థానికులు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన సంబంధిత పీడబ్ల్యూడీ అధికారులతో మాట్లాడి వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ప్రధానోపాధ్యాయులు దంగేటి త్రిమూర్తులు, సీకే పద్మశ్రీ, చిక్కాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



దరియాలతిప్ప హైస్కూల్‌లో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యుద్ధప్రాతిపదికన స్పీడ్ బ్రేకర్లు



ప్రమాద ఘటనా స్థలంలో సీతారామపురం వైపు ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్

తాళ్లరేవు: కాకినాడ-యానాం-అమలాపురం 216 జాతీయ రహదారిని కలుపుతున్న పలు ఆర్అండ్‌బీ రహదారుల ముఖద్వారాల వద్ద జాతీయ రహదారుల సంస్థ అధికారులు బుధవారం స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటుచేశారు. ఆదివారం తాళ్లరేవు బైపాస్ సెంటర్ సుబ్బారాయుని దిమ్మ ప్రాంతంలో ఆటోను ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిని కలుపుతూ వెళుతున్న సుబ్బారాయుని దిమ్మ, కోరంగి కైట్ కాలేజీకి వెళ్లే రహదారి, చినబొడ్డువెంకటాయపాలెం, సీతారామపురం వెళ్లే రహదారి, చొల్లంగి, జి.వేమవరం, పటవల, పోలేకుర్రు, తాళ్లరేవు రహదారి తదితర ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు వేశారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాజ్‌వే కూలి ట్రాక్టర్ బోల్తా

త్రుటిలో తప్పిన ప్రమాదం

మామిడికుదురు: రెండు గ్రామాల సరిహద్దులోని వాద్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై శిథిలమైన కాజ్‌వే బుధవారం కుప్పకూలింది. డొక్కపొట్టు లోడుతో కాజ్‌వే మీదుగా ట్రాక్టరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్‌పై ఉన్న కూలీలు చాకచక్యంగా తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. డ్రైన్‌లో బోల్తా పడిన ట్రాక్టర్‌తో పాటు ట్రక్కును జేసీబీ సహాయంతో బయటకు తీశారు. పాశర్లపూడిలంక-లూటుకుర్రు గ్రామాల సరిహద్దులో ఉన్న ఈ కాజ్‌వే గత కొంత కాలం నుంచి శిథిలస్థితిలో ఉంది. ఇది పూర్తిగా పాడైపోయింది. కాజ్‌వేకు ఒక వైపు భాగం గతంలో దిగబడి పోయింది. అప్పటి నుంచి ఈ కాజ్‌వేపై ప్రయాణం దినదిన గండంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో కాజ్‌వే కుప్ప కూలిపోయింది. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఈ కాజ్‌వే కూలిపోవడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. నాలుగైదు గ్రామాల ప్రజలు ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. కాజ్‌వే కూలిపోవడంతో తమకు ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాశర్లపూడిలంక, లూటుకుర్రు గ్రామాల సర్పంచ్‌లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, అడబాల తాతకాపు కూలిపోయిన కాజ్‌వేను పరిశీలించారు. ఈ కాజ్‌వే పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వాద్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై కూలిపోయిన కాజ్‌వేను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బుధవారం పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యుడు కొరెడ్డి అంజిబాబు అక్కడ నెలకొన్న పరిస్థితులను ఎమ్మెల్యేకు వివరించారు. కాజ్‌వే పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చిట్టిబాబు హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నేతలు యూవీవీ సత్యనారాయణ, నెల్లి దుర్గాప్రసాద్, అంకాని వీరాంజనేయులు, చిక్కం బుజ్జిబాబు, వాసంశెట్టి రామకృష్ణ, బాలం రమేష్, యల్లమెల్లి శ్రీనివాస్, కుడుపూడి రామకృష్ణ ఉన్నారు.



కాజ్‌వే కూలిపోయి డ్రైన్‌లో బోల్తా పడిన ట్రాక్టర్

నాన్‌నీట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యానాం: 2023-24 విద్యా సంవత్సరానికి గాను నాన్‌నీట్ గ్రాడ్యుయేట్ వృత్తికోర్సులు, అండర్ గ్రాడ్యుయేట్ ఆర్ట్స్ అండ్ సైన్స్, కామర్స్, ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో ప్రవేశాలకు బుధవారం సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ(సెంటాక్) నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్, బీఎస్సీ(హానర్స్), అగ్రికల్చర్, హార్టీకల్చర్, బీఎస్సీ(నర్సింగ్), బీపీటీ, బీఎస్సీ(ఎమ్ఎల్‌టి, ఎమ్ఆర్ఐటీ), బీఏఎల్ఎల్‌బీ(5 ఏళ్ల కోర్సు), డీటీ, డీపీపీటీ, డీఎమ్ఐటీ, డీ ఫార్మా తదితర కోర్సులకు సెంటాక్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తారని, జూన్ 6 ఆఖరు తేదీగా నిర్ణయించామని చెప్పారు.

ఓల్డేజ్‌హోమ్‌కు రూ.30 వేలు చెక్కు అందజేత



మల్లాడి కృష్ణారావుకు విరాళం చెక్కు అందజేస్తున్న దాతలు

యానాం: యానాం ఎన్ఆర్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ సతీమణి సత్యవాణి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక యానాం వృద్ధాశ్రమం కోసం రూ.30 వేల విరాళం చెక్కును ఓల్డేజ్‌హోమ్ వ్యవస్థాపకుడు, ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు అందజేశారు. యానాం బెజవాడ గార్డెన్స్‌లో అగ్నికుల క్షత్రియసేవా సంఘం కల్యాణ మండపంలో మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పెండెం సూర్యప్రకాష్, శివగణేష్, మల్లాడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు ఏఎంవీఐ అవగాహన



కొత్తపేటలో ఆటో డ్రైవర్లకు షర్టులు పంపిణీ చేస్తున్న ఏఎంవీఐ కాశీవిశ్వేశ్వరరావు

కొత్తపేట: ఆటోడ్రైవర్లు వాహన చట్టం నిబంధనలు, జాగ్రత్తలు పాటిస్తూ ఆటోలను డ్రైవ్ చేయడం ద్వారా ప్రయాణికులను భద్రంగా గమ్యస్థానం చేర్చాలని అమలాపురం అసిస్టెంట్ మోటార్ వెహికల్ (ఏఎంవీఐ) డి.కాశీవిశ్వేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక ఈవని రామచంద్ర హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు, ఆ సంస్థతో పాటు ఈవని రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్ సామాజిక సేవల్లో భాగంగా ఆటో డ్రైవర్లు కోడ్ ధరించే కాకీ షర్టులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థల చైర్మన్ ఈవని సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఏఎంవీఐ కాశీవిశ్వేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈవని రామచంద్ర పెట్రోల్ బంక్, చారిటబుల్ ట్రస్ట్ వారి సామాజిక సేవ అభినందనీయమన్నారు. అనంతరం 50 మంది ఆటో డ్రైవర్లకు షర్టులు, అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెట్రోఫిల్ మేనేజర్ విన్నకోట రాఘవేంద్రరావు, అపర్ణాంబికాదేవి, సూపర్‌వైజర్ పి.కృష్ణ, పలివెల అభయాంజనేయస్వామి ఆలయ ఫౌండర్ విన్నకోట మారుతీ బంగారం తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జీజీఎం సోమునాయుడు

మామిడికుదురు: నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ (నాబార్డు) సహకారంతో పాశర్లపూడిబాడవలో పంట కాల్వపై రూ.10 లక్షలతో నిర్మించనున్న వంతెన పనులకు నాబార్డు ఏజీఎం, డీడీఎం వై.సోమునాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. రేవుకు వెళ్లే మార్గంలో పంట కాల్వపై వంతెన పాడైపోయి చాలా కాలం నుంచి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వంతెన నిర్మాణానికి నాబార్డు నిధులు మంజూరు చేసింది. నాబార్డు నిధులతో నిర్మించే వంతెనకు జీజీఎం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, పార్టీ నాయకులు తోరం సూర్యభాస్కర్, పాలూరి రాంబాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో ఫుల్లాన్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. స్థానిక గ్రామ సచివాలయం సమీపంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.రాంబాబు, డాక్టర్ సాయి పవన్ నేతృత్వంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రపంచ అధిక రక్తపోటు (బీపీ) దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.